ప్రజాశక్తి
బుధవారం 13 నవంబర్ 2024
5
కర్నూలు

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజలపై భారాలు తగ్గించాలి

- సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి
- ప్రజాపోరులో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిత్యవసర వస్తువుల ధరలను కరెంట్ చార్జీలను తగ్గించాలని సిపిఎం ప్రజా పోరు యాత్ర మంగళవారం కర్నూలు బుధవార్‌పేట 14వ వార్డు ,16 వ వార్డులలో నిర్వహించారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆర్.కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా నాయకులు ఎండి.ఆనంద్ బాబు , ఓల్డ్ సిటీ సిపిఎం నగర సెక్రటేరియట్ సభ్యులు కె.రామకృష్ణ పాల్గొన్నారు. ప్రజా పోరు యాత్ర భవనమ్మ గుడి అభిముబారక్ నగర్,పద్మచంద్ర హాస్పిటల్,సుశీల నేత్రాలయ అమీన్ బాష దర్గా, కమ్మ గేరి, పిండిగిర్ని, జవారి సందులలో సాగింది. జిల్లా కార్యదర్శి డి.గౌశాయ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించాయన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలపై మోయలేని భారాలు వేశారన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజల పైన రూ.60నుంచి 72 కోట్లు భారాన్ని వేసి ఇది 2022-23 వాడిన కరెంటు చార్జీలు ప్రజల నుండి వసూలు చేయాలని ఆలోచన చేయడమే దుర్మార్గమని విమర్శించారు. మాది మంచి ప్రభుత్వమని ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటించడం కాదని, వంద రోజుల్లో మీరు ఏమి సాధించారని ప్రశ్నించారు. ప్రజల్లో వ్యతిరేకత మొదలవుతుందని గమనించిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలని తప్పుదారి పట్టించేందుకు మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు తిరుపతిలడ్డును తీసుకొచ్చి ప్రజల ఆలోచనలు తిరుమలలో లడ్డు చుట్టూ మళ్లించాలని ప్రయత్నం చేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని పాటించాలని ప్రజలను మభ్యపెట్టారన్నారు. ఇలా ఎంతోకాలం ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. ఉచితంగా ఇసుకను ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఇసుకలో తెలుగుదేశం కార్యకర్తలకు ఇసుక మాఫియాగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్యుత్ భారాలు తగ్గించాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ ఈనెల కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలు ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం నాయకులు జి బజారి, ధనరాజ్, దేవరాజ్,ఎం.రాజు, బాలరాజు, జక్కు మంతుడు, ఎన్.రాజు, రాజేష్, నవీను, తదితరులు పాల్గొన్నారు

ప్రజాపోరు యాత్రలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి

విద్యుత్‌భారాలు, నిత్యవసర ధరలను తగ్గించాలి
- 29, 30వ వార్డులలో సిపిఎం ప్రజా పోరు

కర్నూలు హాస్పిటల్ : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని 29, 30వ వార్డులలోని శరిన్ నగర్, కస్తూరినగర్, గట్టయ్యనగర్, ఉద్యోగనగర్, బాలాజీ నగర్, శారదనగర్ ప్రాంతాలలో ప్రజాపోరు యాత్ర జి.ఏసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ ప్రచారంలో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, ట్రూఆప్ చార్జీలు రద్దు చేయాలని, బెల్ట్ షాపులు అరికట్టాలని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, స్థానికంగా వార్డులోని కాలనీలలో రోడ్లు, కాలువలు వేయాలని కోరుతూ నినాదాలు చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా, నగర కమిటీ సభ్యులు హుస్సేన్ బాషమాట్లాడారు. ఈనెల 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు ఈ ధర్నా కార్యక్రమానికి నగర ప్రజానీకం మద్దతు తెలిపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేష్, సివివర్మ, దేవేంద్ర, మోహన్, అలీబాష, మధు, రవి పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్రలో మాట్లాడుతున్న నాయకులు ఏసు ,తదితరులు

రీ సర్వే ఫిర్యాదులను పరిష్కరించాలి

- డిసెంబర్ 15 నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి
- కలెక్టర్ పి రంజిత్ బాషా
- ఆరుగురు ఎంఇఒ లపై చర్యలకు ఆదేశాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రీ సర్వేకు సంబంధించి గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ పి.రంజిత్ బాష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కర్నూలు డివిజన్‌స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి పెండింగ్ ఉన్న వాటిని వెరిఫై చేయాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. కర్నూలు అర్బన్‌లోని ఎబిసి క్యాంప్‌క్వార్టర్స్‌లలో ఎంత మేరకు ప్రభుత్వ భూమి ఉంది. తదితర వివరాలను ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. భూసేకరణకు సంబంధించి ప్రగతి తక్కువగా ఉందని ఎందుకు సంబంధించి పరితకఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రబీలో ఈ పంట నమోదు వందశాతం చేయాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ లోపు ఆర్‌అండ్‌బి రోడ్లలో గుంతలు పూడ్చేపనులు పూర్తిచేయాలని కలెక్టర్‌ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. కోడుమూరు ఎమ్మిగనూరు రోడ్‌ను టాప్ ప్రయారిటీగా తీసుకోవాలన్నారు. పనులను నాణ్యతగా లేకపోతే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కలెక్టర్ ఎస్ఇని ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పల్లె పండుగలో భాగంగా గ్రామాల్లో నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులన్నీ డిసెంబర్ 31 వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. పిల్లలకు విద్యా బోధనకు వీలుగా హాస్టల్‌లలో కూడా కంప్యూటర్ ల్యాబ్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

టిజి భరత్‌కు సిఎం అభినందన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఎపిలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒప్పందం చేసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఎంఒయు జరిగింది. ఈ ఒప్పందం ద్వారా 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయంతో పాటు 2.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నేటి ఒప్పందం గొప్ప ముందడుగు అన్నారు. పెట్టుబడులకు రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఎపి కేంద్రంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. రిలయన్స్‌తో ఒప్పందం సంతోషకరమని, 500 సిబిజి ప్లాంట్స్ మూడేళ్లలో ఏర్పాటు అవుతాయని అన్నారు. ఒక్కో ప్లాంట్ రూ.130 కోట్లతో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు...పర్యావరణానికి మేలు జరుగుతుందని సిఎం అన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ ఛైర్మన్‌గా మంత్రి లోకేష్.. ఆ బాధ్యతను నెరవేర్చే క్రమంలో నేటి ఒప్పందం కీలక ముందడుగు అన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్ వేగంగా నిర్ణయాలు తీసుకుని ప్రాజెక్టు ఒప్పందం జరగడానికి దోహద పడ్డారని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

ఎపిలో పరిశ్రమల స్థాపనకు అంగీకరిస్తున్న పారిశ్రామిక వేత్తలు, వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, టిజి.భరత్

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ర్యాగింగుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె.నాయక్ అన్నారు. మంగళవారం రాయలసీమ వర్సిటీలో సమావేశ భవనంలో ర్యాగింగ్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్, కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ పాల్గొన్నారు. విసి మాట్లాడుతూ జూనియర్లు, సీనియర్లు సోదర భావంతో మెలగాలన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ర్యాగింగ్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. డిఎస్‌పి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు, రెక్టార్ సివి.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీసీ ఎన్‌టికె.నాయక్

రోగులకు అందుబాటులో మెడికల్ బోర్డు

- జిజిహెచ్ సూపరిన్ టెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ (పథకం- ఆరోగ్య పింఛన్లు) కింద రోగులు ధ్రువీకరణ పత్రాలు పొందుటకు అందుబాటులో మెడికల్ బోర్డు ఉంటుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు తెలిపారు.. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కొందరు పేషెంట్లకు పెన్షన్ పెంచడానికి అనుమతులు జారీ చేసిందని తెలిపారు. వీల్ చైరు, బెడ్‌కు మాత్రమే పరిమితమైన పేషంట్లకు, ప్రమాదాలు జరిగి పేషెంట్ లు , మస్కులర్ డిస్ట్రఫీ ఉన్న పేషంట్లకు పెన్షన్ రూ.5000 నుంచి రూ 15000 కు పెంచడానికి నిర్ణయించిందని తెలిపారు. రెండు కాళ్లకు బోదకాలు వ్యాపించిన వారికి, ప్రత్యేక పరిస్థితిలో కిడ్నీ డయాలసిస్ చేసుకునే రోగులకు నిబంధనలు అనుసరించి, కిడ్నీ, కాలేయం, హార్ట్ ట్రాన్స్ ప్లాంట్ చేసుకున్న పేషంట్లకు రూ 5 వేల నుంచి రూ 10 వేల వరకు పెన్షన్ పెంచామని అన్నారు. అందుకోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ (పథకం- ఆరోగ్య పింఛన్లు) మెడికల్ బోర్డు సర్టిఫికెట్ల జారీ కొరకు మెడికల్ టీం ప్రతి బుధవారం ధన్వంతరి హాల్లో నిర్వహించే బోర్డును సదరం 41 లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 గంటల నుంచి 1:00 వరకు, ఈ సర్టిఫికెట్లు అర్హులైన వారికి ఇస్తారని తెలిపారు.



డ్వామా పిడికి వినతిపత్రం అంజేస్తున్న కెవి.నారాయణ, తదితరులు

వైఎస్‌ఆర్ జలకళ అవినీతిపై విచారణ చేయాలి

డ్వామా పిడికి వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తుగ్గలి మండలంలో వైఎస్ఆర్ జలకళ లో అవినీతిపై విచారణ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ డిమాండ్ చేశారు. 19 గ్రామాల్లో బోరు బావులు మంజూరు చేసి శభాష్‌పురం గ్రామంలో 14 బోర్లు వేసి నిధులను కాజేసారన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇంచార్జి ప్రాజెక్టు డైరెక్టర్ నాసర రెడ్డికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జి.గోపాల్ కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. తుగ్గలి మండలంలో వైఎస్ఆర్ జలకల కింద 19 గ్రామాలకు బోరు బావులు మంజూరు చేశారన్నారు. శభాష్‌పురం గ్రామానికి 104 బోరుబావులు వేశారని ఆ బోరుబావులకు విద్యుత్ మీటర్లు మోటర్లు బిగించేందుకు రూ.కోటి దాకా క్లస్టర్ ఎపిడికి ముడుపులు అందాయన్నారు. బోరు బావులు వేసిన ప్రదేశాలు చూపించాలని నిజ నిజాలు తేల్చి అందులో ఏవైనా తప్పిదాలు ఉంటే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదోని మండలంలో పనులు చేయకపోయినా పనులు చేసినట్లు మస్టర్లు వేసి అప్లోడ్ చేస్తున్నారన్నారు. దీనిపై కూడా విచారణ చేపట్టి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఖాజాబేగ్

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం బోయినపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఖాజా బేగ్ జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆయనకు శాలువా కప్పి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించి ప్రత్యేకంగా అభినందించారు.

టిడిపిలో కష్టపడిన వారికి గుర్తింపు

టిడిపి జిల్లా అధ్యక్షులు పి. తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీని అధికారంలోకి తీసుకొని రావడంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక గుర్తింపునిస్తూ పదవులను కట్టబెట్టారని కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయం లో కుడా చైర్మన్‌గా నియమితులైన సోమిశెట్టి వెంకటేశ్వర్లుని సన్మానించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పార్టీకి సేవలందించిన వారికి పదవులు కట్టబెట్టిన పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకి, పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌కు పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కు , కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కర్నూలు జిల్లా నుండి కుడా చైర్మన్‌గా పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లుని, కరుభ/కురుమ వెల్ఫేర్ కార్పోరేటన్ చైర్మన్ ఎం. దేవేంద్రప్పని, వాల్మీకి వెల్ఫేర్ కార్పోరేషన్ చైర్పర్సన్ గా కప్పట్రాళ్ల బొజ్జమ్మను నియమించారన్నారు. రానున్న రోజులలో మరికొన్ని పదవులను జిల్లాకు పార్టీ అధినేత ఇవ్వనున్నారన్న అశాభావాన్ని వ్యక్తం చేశారు. టిడిపి ఎప్పుడు కూడా బిసిల పార్టీ అనేదానికి నిదర్శనం పదవుల వచ్చిన దాన్ని బట్టి మరోసారి రుజువ చేశారన్నారు. గతంలో పార్టీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్గా పనిచేసిన దేవేంద్రప్పని కుర్వ - కురుమ కార్పోరేషన్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారనీ, కుర్వ సామాజిక వర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజును ఎంపిగా అవకాశం కల్పించారని, గతంలో బత్తినె వెంకటరాముడుని జడ్‌పి. చైర్మన్ చేశారని, అలూరు కురభ జయరామ్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించిందని అన్నారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బొజ్జమ్మకి ప్రస్తు అవకాశం వచ్చిందన్నారు. గతంలో వారి తండ్రి వెంకటప్పనాయుడుని జడ్‌పిటిసిసభ్యునిగా అవకాశం ఇచ్చారన్నారు. వాల్మీకులలో బిటి. నాయుడుకి కర్నూలు పార్లమెంట్ కు పోటీచేయడానికి అవకాశం వచ్చిందని, ప్రస్తుతం ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారన్నారు. టిడిపి నాయకులు ఆకెపోగు ప్రభాకర్, పి.రాజు, షేక్షావలి, డి. జేమ్స్, బజారన్న, ఎల్‌వి ప్రసాద్, మల్లెల పుల్లారెడ్డి, కె.మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును ఆలింగనం చేసుకుని అభినందిస్తున్న తిక్కారెడ్డి

కళాజాతాకు మద్దతు తెలపండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎల్ఐసి ఆధ్వర్యంలో ఈనెల 13న బుధవారం ఎల్ఐసి పరిరక్షించుకోవాలని కోరుతూ సాయంత్రం ఐదున్నర గంటలకు సిక్యాంపు సెంటర్ చేరుకోనున్న ఆట,మాట, పాట రాష్ట్ర కళాజాతాకు స్వాగతం పలుకుతూ సిఐటియు అనుబంధ సంఘాలన్ని ఉద్యమ సంఘం బ్యానర్‌ను పట్టుకొని స్వాగతం పలకాలని జిల్లా కార్యదర్శి ఆర్.సునియా కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని బ్యానర్ పట్టుకున్నచో ప్రభుత్వ రంగ సంస్థలు కాపాడుటకు వీలవుతుందన్నారు. ఈ రకంగా మన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడు కుందామని, మీ సంస్థ యొక్క బ్యానర్ పట్టుకున్నా బాగుంటుందని తెలిపారు.

మోడల్ స్కూల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-మద్దికేర : ఎపి మోడల్ స్కూలులో మినరల్‌వాటర్ ప్లాంట్‌కు ప్రిన్సిపల్ సవిత ఆధ్వర్యంలో మరమ్మతులు చేస్తున్నట్లు విద్యాకమిటీ వైస్‌చైర్మన్ నాగభూషణం తెలిపారు. మద్దికేర ఎపి మోడల్ స్కూలులో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. గత కొద్దిరోజుల క్రితం సాంకేతిక కారణాలతో మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో నీటి సమస్య ఉత్పన్నమైందని అన్నారు. పాఠశాల విద్యా కమిటీ వైస్‌చైర్మన్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. వాటర్ ప్లాంట్ అందుబాటులోకి రావడంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నీటి సమస్య లేకుండా పోయిందన్నారు.

ఎలక్ట్రీషియన్లకు ఎపి ప్రభుత్వం శుభవార్త

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : రాష్ట్రంలోని 1.2 లక్షల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను 'ఊర్జవీర్ ఎనర్జీ ఎఫీషియన్సీ వారియర్ స్కీమ్' కింద వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రంతో కలిసి ఎపి ప్రభుత్వం ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లనుంది. ఇందులో భాగంగా మంగళవారం కర్నూలు విద్యుత్ భవన్ కార్యాలయంలో రిజిస్టేషన్ ప్రక్రియ , ఎలక్ట్రీషియన్స్‌కు శిక్షణ ఇచ్చారు.కర్నూలు జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎం.ఉమాపతి , విద్యుత్ తనిఖీ అధికారి అజయ బాబు , నోడల్ అధికారి , ఉప విద్యుత్ తనిఖీ అధికారి యామిని , ఇఇఎస్ఎల్ డిస్ట్రిక్ట్ కోర్డినేటర్ జగదీశ్ కుమార్ , కమతం పుల్లారెడ్డి లు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష

క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష అభినందించారు. జిల్లా కలెక్టర్, జిల్లా క్రీడా ప్రాథమిక సంస్థ కర్నూలు జిల్లా తరపున జిమ్నాస్టిక్ క్రీడాకారులు ఈనెల 7 నుండి 9 వరకు కాకినాడ డిఎస్‌ఎ స్టేడియంలో జరిగిన అండర్ 19 ఎస్ఎఫ్ హెచ్ బాలురు , బాలికల విభాగంలో కర్నూలు జిల్లాకు నాలుగు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం లభించాయని జిల్లా క్రీడాభివద్ధి సంస్థ అధికారి భూపతిరావు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. జిమ్నాస్టిక్స్ అధ్యక్షులు డి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

కురువ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రామకృష్ణ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కురువ కురుమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టిడిపి జిల్లా యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ ఎన్నికయ్యారు. ఆయన విద్యార్థి దశ నుండి ఉద్యమ నాయకుడిగా అనేక పోరాటాలు నిర్వహించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీలు విడుదల కోసం అనేక పోరాటాలు నిర్వహించారు. అంతేకాకుండా విద్యార్థులకు అధిక ఫీజులకు వ్యతిరేకంగా తొలి నుంచి అనేక పోరాటాలు నిర్వహించారు. యువజన సంఘం నాయకుడిగా నిరుద్యోగుల ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించారు. కురువ సమాజంలో ఆ సామాజిక తరగతి సమస్యలపై కూడా ప్రత్యేక పోరాటాలు నిర్వహించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఆపై టిడిపిలో చేరి తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించి పార్టీకి సేవలు అందిస్తూ వస్తున్నారు. పార్టీ వైపు యువతను ఆకర్షిస్తూ ప్రత్యేకతను చాటుకున్నారు. కర్నూలు ఎంపీకీ అందుబాటులో ఉంటూ అంకితభావంతో గెలుపు కోసం తన వంతు కృషి చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఆయన సేవలను గుర్తిస్తూ కురువ, కురుమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ పదవి లభించడం సంతోషకరంగా ఉందని, తన సేవలను గుర్తిస్తూ కురుబ, కురుమ కార్పొరేషన్ డైరెక్టర్గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్‌కు, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కురువ సమాజ అభివృద్ధికి తన వంతు కషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ సోమన్న

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, డీఎస్పీ

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ సోమన్న తెలిపారు. మంగళవారం పట్టణ శివారులోని జిఎస్ఆర్ హైస్కూల్‌లో నేషనల్, జిఎస్ఆర్ విద్యా సంస్థల అధినేత జి.గోపాల్ రెడ్డి అధ్యక్షతన బాలికల త్రోబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అంతకుముందు ఆదోని డీఎస్పీ సోమన్న జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని చెప్పారు. డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ... క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి కూడా ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన 16 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిఎస్ఆర్ పాఠశాల అధినేత గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యాశ్రీని అభినందించారు. ఆదోని ఎంఇఒలు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలకు సహకారం అందిస్తాం

- మాజీ ఐజి ఇక్బాల్ అహ్మద్, జనసేన నేత చల్లా వరుణ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మాజీ ఐజి ఇక్బాల్ అహ్మద్

పట్టణంలోని మాచాని సోమప్ప ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మాజీ ఐజి ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రీడా పరికరాలతో పాటు రూ.30 వేల నగదును పాఠశాలకు అందజేశారు. పాఠశాల ముందు గ్రౌండ్‌కు గ్రావెల్ వేయిస్తానని తెలిపారు. స్కూల్ ఆవరణ నుంచి మురుగునీరు, వర్షపు నీరు బయటికి డ్రెయినేజీలో వెళ్లడానికి చర్యలు చేపడతామని చెప్పారు. జనసేన నియోజకవర్గ నాయకులు చల్లా వరుణ్ కూడా స్కూల్ అభివృద్ధికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే 5 మురుగుదొడ్లు నిర్మించి, 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు ఏర్పాటు చేసి వాటికి కుళాయిలు బిగించే విధంగా చేస్తానని చల్లా వరుణ్ హామీ ఇచ్చారు. అంతకుముందు ఇక్బాల్ అహ్మద్, చల్లా వరుణ్‌లు ప్రభుత్వాస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రికి కుర్చీలు అందజేశారు. తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసి నీరు అందజేస్తానని చల్లా వరుణ్ తెలిపారు. ఆస్పత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు ఉన్నాయని, ఆక్సిజన్ పని చేయడం లేదని, ఎమ్మెల్యే బీవీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఇక్బాల్ అహ్మద్ హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డాక్టర్ సుధ, మల్లికార్జున, డాక్టర్ బాలాజీ, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మల్లీశ్వరి, పీడీ సుజన కుమారి, ఉపాధ్యాయులు సులోచన, వెంకటేశ్వర్లు, సౌభాగ్యమ్మ, ఎఎస్ఐ కిష్టప్ప, కానిస్టేబుల్ ఫరూక్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీలోకి ఇద్దరు...

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా గుమ్మల బాబు

- ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్‌గా చంద్రపాల్

ప్రజాశక్తి - గోనెగండ్ల

యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా ఎన్నుకున్న జిల్లా కమిటీలో గోనెగండ్ల మండలం నుంచి ఇద్దరికి చోటు దక్కింది. జిల్లా కార్యదర్శిగా గుమ్మల బాబు ఎన్నికయ్యారు. ఈయన గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక జిల్లా కన్వీనర్‌గా యు.చంద్రపాల్ ఎన్నికయ్యారు. ఈయన బి.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తూ ప్రస్తుతం యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. వీరికి యుటిఎఫ్ మండల అధ్యక్షులు పి.మద్దిలేటి, నాయకులు లింగన్న, అబ్దుల్, సలీం, కెసి.నాగరాజు, అక్బర్, రంగస్వామి, పురుషోత్తం, మునిస్వామి, నాగలక్ష్మి అభినందనలు తెలిపారు. గుమ్మల బాబు మాట్లాడుతూ... ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు మండలంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. యు.చంద్రపాల్ మాట్లాడుతూ... యుటిఎఫ్ బలోపేతానికి మరింత కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయులకు దిక్సూచి లాంటి ఐక్య ఉపాధ్యాయ పత్రికను జిల్లాలో మరింతగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

గ్రామసభలతో భూ సమస్యలు పరిష్కారం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు గ్రామ సభల ద్వారా పరిష్కారం అవుతాయని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉరుకుంద గ్రామంలో సర్పంచి రాధ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. రెవెన్యూ పరంగా ఏమైనా సమస్యలుంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. పొలాల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని, హద్దులు సరిగ్గా లేవని తదితర సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

వలసలపై తెలుసుకోవాలని ఉంది

మండలం నుంచి వలసలు ఎక్కువగా వెళ్తున్నారని, దీని గురించి తెలుసుకోవాలని ఉందని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఎందుకు వలస వెళ్తున్నారు, ఏ ప్రాంతానికి ఎక్కువగా వెళ్తున్నారు, అక్కడ మీకు ఎలాంటి వసతులు ఉంటాయి, ఇక్కడ మీకు ఉపాధి పనులు లేవా, మీరు వలస వెళ్తే మీ పిల్లల భవిష్యత్తు, చదువు ఎలా అని ప్రశ్నలు వేసి వారిని అడిగి తెలుసుకున్నారు. వలస వెళితే పిల్లలతో పాటు అందరికీ పని దొరుకుతుందని, ఎక్కువ డబ్బులు వస్తాయని కూలీలు తెలిపారు. ఇక్కడ పెద్దలకు మాత్రమే పని ఉంటుదని, కూలి కూడా తక్కువ వస్తుందని చెప్పారు. గుంటూరు ప్రాంతానికి వెళితే రెండు, మూడు నెలలు మిరప పొలంలో పనులు ఉంటాయని, కూలి మాత్రమే దొరుకుతుంది, తెలంగాణ ప్రాంతానికి వెళితే పత్తి తూకం ప్రకారం పని ఉంటుందని తెలిపారు. రోజుకు ఒక్కొక్కరు రూ.వెయ్యి సంపాదిస్తామని చెప్పారు. సీజన్ హాస్టల్ ఎక్కడో ఉంటుందని, పిల్లాపాపలతో పాటు వలస వెళ్తామని పేర్కొన్నారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, డిప్యూటీ తహశీల్దార్ రజని, రజనీకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

అగ్రి టెస్టింగ్ ల్యాబ్

కట్టారు.. వదిలేశారు..!

- రూ.లక్షల విలువ చేసే యంత్రాలు మూలకు..!

- అందుబాటులో ఉండని సిబ్బంది..!

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. పట్టణంలోని ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో రూ.లక్షల విలువ చేసే యంత్రాలు మూలన పడ్డాయి. భూసార పరీక్షలు, పశువులకు సోకే జబ్బులు, తదితర వాటిపై పరీక్షల నిమిత్తం వీటిని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఆదోనిలో దాదాపు రూ.40 లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని 2022లో ప్రారంభించారు. దాదాపు రూ.20 లక్షల పరికరాలనూ తెప్పించారు. పరికరాలకు సంబంధించిన ఫర్నీచర్ రాలేదు. దాని గురించి నాటి పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో అది నేటికీ నిరుపయోగంగా ఉంది. ప్రజాధనం వృథా అయింది. ఇందులో విధులు నిర్వహిస్తున్న అధికారులు కూడా అందుబాటులో ఉండడం లేదని విమర్శలు గుప్పుమంటున్నాయి. రైతులు ల్యాబ్‌లకు వెళ్లినా నిరాశ తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ ల్యాబ్‌లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంచాయతీలో రూ.6 లక్షలు స్వాహా..?

- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఆలూరు

డిఎల్‌పిఒ వీరభద్రప్ప

ఆలూరు మేజర్ పంచాయతీలో రూ.6 లక్షలు స్వాహా చేసినట్లు సమాచారం. కూరగాయల మార్కెట్, వారపు సంత, బస్టాండ్ వేలం పాటల ద్వారా వచ్చిన డబ్బులను పంచాయతీ ఖజానాకు జమ చేయకుండా గతంలో పనిచేసిన అధికారి తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు తెలిసింది. పంచాయతీ ఖజానాకు జమచేయాల్సిన కింది స్థాయి సిబ్బందికి నచ్చజెప్పి డబ్బులను వాడుకున్న అధికారి ప్రస్తుతం ఇక్కడి నుంచి మరో చోటకు బదిలీపై వెళ్లారు. పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ కావాల్సిన నిధులు జమ కాకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గత మూడు నెలలుగా పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు జీతాల్లేక ఆందోళన చెందుతున్నారు. ఖజానాలో డబ్బులు లేక జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది. గత మూడు రోజుల్లో కొంత మొత్తాన్ని జమ చేసినట్లు తెలిసింది. పంచాయతీకి జమ కావాల్సిన నిధులు పక్కదారి పట్టినట్లు తెలిసినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదంటే నిధుల స్వాహాలో వీరి పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై డిఎల్‌పిఒను వివరణ కోరగా... ప్రస్తుత కార్యదర్శి కొత్తగా విధుల్లోకి వచ్చారని, ఈ విషయాన్ని పరిశీలిస్తారని తెలిపారు.

పశుగ్రాసం సాగుకు ఆర్థిక సాయం : జెడి

ప్రజాశక్తి - ఆస్పరి

రైతులు పశుగ్రాసం సాగు చేసేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని జెడి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గ్రామ పశువైద్య కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడారు. ఎన్ఎల్ఎం ద్వారా గొర్రెల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం బ్యాంకు అనుసంధానం చేసి 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తుందన్నారు. రైతులు ముందుకొచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశుగ్రాసం సాగు నిమిత్తం ఐదెకరాల భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు రైతులకు మొత్తం ఖర్చు ప్రభుత్వం ఒక సంవత్సరం వరకు నిధులు అందిస్తుందన్నారు. రైతులు దరఖాస్తుతో పాటు జాబ్ కార్డు, పొలం వన్ బి, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రంలో, పశు వైద్య కార్యాలయంలో ఇచ్చి పూర్తి వివరాలను అక్కడే తెలుసుకోవచ్చు ని తెలిపారు. జిఎం జవహర్ లాల్, వెటర్నరీ డాక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడి శ్రీనివాసులు

కార్యకర్తకు శ్రీనివాసులు రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిడిపి నాయకులు, చెట్నపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి ఈరన్నను టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి పరామర్శించారు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొంది మంగళవారం ఇంటికి చేరుకున్న ఈరన్న ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, తామున్నామని భరోసా ఇచ్చారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కో ఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, తిక్కస్వామి గౌడ్, రవి ఉన్నారు.

పరామర్శిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా నరసింహులు

ప్రజాశక్తి - నందవరం

కెవిపిఎస్ మండల కార్యదర్శిగా నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవసహాయం, ఎమ్‌డిఆనంద్ బాబు, ఆర్‌విఎస్ జిల్లా కార్యదర్శి గురుశేఖర్ తెలిపారు. మంగళవారం నందవరంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతోపాటు దళిత వాడలు, అన్ని రకాల దళిత వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. అనంతరం కెవిపిఎస్ నూతన మండల కార్యదర్శిగా నాగలదిన్నె నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కెవిపిఎస్ మండల నాయకులు జయరాజు, దేవరాజు, చిన్నరాజు, స్వామిదాసు, దేవదాసు, బొజ్జన్న, మార్క్ పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి జియోట్యాగ్

ప్రజాశక్తి - నందవరం

సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి జియోట్యాగ్ చేపట్టారు. మంగళవారం 5వ వార్డులో సుమారు 50 కుటుంబాలను జియోట్యాగ్ చేసినట్టు వెల్ఫేర్ అసిస్టెంట్ రుక్మన్ బాష తెలిపారు. ప్రతి ఒక్కరూ జియోట్యాగ్ చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే జియోట్యాగ్ తప్పనిసరి అని తెలిపారు.

ఎస్పీని కలిసిన చెన్న బసప్ప, సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఎస్పీ బిందు మాధవ్‌ను టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ చెన్న బసప్ప, టిడిపి యువ నాయకులు సుధీర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతున్న ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎస్పీని కలిసిన చెన్నబసప్ప, సుధీర్ రెడ్డి

వాగ్దానాలు అమలు చేయాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.అంజిబాబు, మండల నాయకులు జయరాజు డిమాండ్ చేశారు. ఈనెల 14న మండల కార్యాలయాల దగ్గర చేపట్టే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానికంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో సుమారు రూ.16 వేల కోట్లు ప్రజలపై భారం వేస్తోందని మండిపడ్డారు. సిపిఎం నాయకులు ప్రాణేష్, సురేష్, మారెప్ప, అంజి, రాజు, ఇజ్రాయిల్, లక్ష్మన్న, తిక్కన్న పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని అంబేద్కర్ నగర్, షేర్ ఖాన్ కొట్టాలలో ప్రజా పోరు ప్రచార కార్యక్రమం సాగింది.

మంత్రాలయంలో మాట్లాడుతున్న అంజిబాబు

ఈనెల 14న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న కోరారు. సిపిఎం పట్టణ నాయకులు వీరేష్, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 10వ వార్డు కటిక పేట, పెద్ద కమేలా ఏరియా, చంద్రయ్య కొట్టాలు, బిల్లాలి మసీద్ ప్రాంతాల్లో పర్యటించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు బి.రాముడు, యు.రమేష్, కెవిపిఎస్ నాయకులు ఆంథోని, రైతుసంఘం నాయకులు అబ్దుల్లా, సుభాన్, సిపిఎం కార్యకర్తలు మగ్బుల్, ఉరుకుందు, నాగూర్ బాష పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని కామవరం, ఉరుకుంద, చిరుతపల్లి, మల్లన్న హట్టి, కరణి, తిప్పలదొడ్డి, చూడి గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి ఈరన్న, ఉల్లిగయ్య, నాగరాజు, గిరప్ప పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎపిఒ జుబేర్ అహ్మద్

సిసి రోడ్డు నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని డేగలపాడు గ్రామంలో ఉపాధి హామీ నిధుల కింద చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం తుది దశకు వచ్చిన నేపథ్యంలో మంగళవారం ఉపాధి హామీ ఎపిఒ జుబేర్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిసి రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి వేసినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. సిసి రోడ్డును నాణ్యతగా వేసుకున్నప్పుడే కొన్నేళ్ల పాటు దెబ్బతినకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వం సిసి రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను మంజూరు చేసిందన్నారు. మంజూరయిన గ్రామాల్లో సిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని సంబంధిత ప్రజా ప్రతినిధులకు సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ మారుతి, అంజి పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై హర్షం

ప్రజాశక్తి- దేవనకొండ

కప్పట్రాళ్ల బొజ్జమ్మ

రాష్ట్రానికి రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించడం పట్ల రాష్ట్ర వాల్మీకి వెల్ఫేర్ ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. దళితుల సంక్షేమానికి రూ.18,497 కోట్లు, ఆడబిడ్డ నిధి, ఉచిత విద్యుత్ పథకానికి రూ.300 కోట్లు, ఎన్‌టిఆర్ విద్యోన్నతికి రూ.51 కోట్లు, డ్వాక్రా సున్నా వడ్డీ పథకానికి రూ.1,125 కోట్లు, బీసీ సంక్షేమానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ రుణాలను మరిచిందన్నారు. మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, హంద్రీనీవా ప్రధాన కాలువ మరమ్మతు, లైనింగ్ పనులకు నిధులు విడుదల చేస్తారని తెలిపారు.

అధికారి నిర్లక్ష్యంతో నష్టం

- గోకులం పథకానికి అర్హునిగా గుర్తించండి

- ఏపీడీ విచారణలో బాధితుని ఆవేదన

ప్రజాశక్తి - మంత్రాలయం

అధికారి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ గోకులం సంక్షేమ పథకంలో తనకు నష్టం జరిగిందని ఉపాధి ఏపీడీ లోకేశ్వర్ వద్ద బాధితుడు సిక్కం అంజినయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన సిక్కం దేవన్న ఫిర్యాదు మేరకు మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏపీడీ విచారణ చేపట్టారు. సిక్కం అంజినయ్య మాట్లాడుతూ... మొదటి జాబితాలో తనకు మినీ గోకులం పథకం ఎందుకు మంజూరు కాలేదని, ఆ పథకానికి అన్ని విధాలుగా తమ తండ్రి సిక్కం దేవన్న అర్హుడని ఎంపిడిఒ శోభారాణిని ప్రశ్నించినట్లు తెలిపారు. అందుకు తనపై పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తామని బెదిరించారని, కులం పేరుతో దూషించారని 'మీ కోసం'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మినీ గోకులం పథకానికి ముందుగానే దరఖాస్తు చేసుకున్నప్పటికీ పశు వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ తల్లి చనిపోవడంతో మరో పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కు దరఖాస్తును అప్పగించారని తెలిపారు. ఎపిఒకు తమ దరఖాస్తు అందకపోవడంతో మళ్లీ దరఖాస్తును డాక్టర్ సురేఖ అడిగి తెలుసుకున్నారని చెప్పారు. అక్టోబర్ 7న ఇచ్చిన దరఖాస్తు కనిపించకపోవడంతో జాబితాలో తమ పేరు లేదని తెలిపారు. మినీ గోకులం పథకం పొందేందుకు అధికారులు అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన ఏపీడీ లోకేశ్వర్ మాట్లాడుతూ... లబ్ధిదారుల ఎంపిక తన పరిధిలో ఉండదని, మరో జాబితాలో రావచ్చని పేర్కొన్నారు. కులం పేరుతో దూషించారని చేసిన ఫిర్యాదుపై ఎంపిడిఒ శోభారాణి మాట్లాడుతూ... సిక్కం దేవన్న దరఖాస్తు ఎపిఒ ద్వారా తనకు అక్టోబర్ 25న అందించారని తెలిపారు. ఎంపిపి తీర్మానంతో అక్టోబర్ 29న నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. సిక్కం అంజినయ్య దురుసుగా మాట్లాడారని, అందుకే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మాత్రమే హెచ్చరించానని, కులం పేరుతో దూషించలేదని తెలిపారు. ఎపిఒ తిమ్మారెడ్డి, పశు వైద్యాధికారి సురేఖ, క్లస్టర్ టిఎ గిడ్డయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీడీ

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.35 వేల విలువ చేసే 400 స్టీల్ ప్లేట్లను పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నాగేంద్ర కుమార్ ఉచితంగా అందజేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌరమ్మ చేతుల మీదుగా ప్లేట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ప్లేట్లను అందజేసిన నాగేంద్ర కుమార్‌ను అభినందించారు. గణిత ఉపాధ్యాయులు నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ... సేవా దృక్పథంతో పేద విద్యార్థులకు సేవ చేస్తున్నామని తెలిపారు. పాఠశాల సిబ్బంది జ్ఞాన ప్రకాష్, శివశంకర్, రామాంజినేయులు, వెంకటేష్, రామ్, నాగరాజు, మీనాక్షి, ఈరన్న, రాజశేఖర్, దవళేశ్వరి పాల్గొన్నారు.

ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

వలసలు వద్దు.. ఉపాధి పని కల్పిస్తాం

- సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామంలో ప్రజలు వలసలు వెళ్లరాదని, ఉపాధి పనులు కల్పిస్తామని సర్పంచి పాల్‌దినకరన్ తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. ఉపాధి హామీ చట్టం నిబంధనల మేరకు పనిచేస్తే రోజువారీ కూలి రూ.300కు తగ్గకుండా అందిస్తామన్నారు. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడకుండా, ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకోకుండా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శివప్ప, ఎపిఒ మాధవ శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు అన్యాయం

- ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా శాఖకు అన్యాయం జరిగిందని ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు తెలిపారు. మంగళవారం ఆదోనిలో ఎఐఎస్ఎఫ్ జిల్లా 30వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ముందుగా ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ నుంచి వైఎంజి సర్కిల్, భీమాస్ కూడలి మీదుగా రెడ్డీస్ హాస్టల్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను కాషాయీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా ఉందన్నారు. ఈ విధానపై పునః సమీక్షించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు 30 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 9 శాతం కేటాయించడం అన్యాయమన్నారు. ఈ నిధులు పాఠశాలల బ్యాగులకు, ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి పుస్తకాలకు ఏమాత్రం సరిపోవన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తూ నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని మండిపడ్డారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుళాయి స్వామి, కార్యదర్శి సాబీర్ బాష, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఎస్‌టియు రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీరచంద్ర యాదవ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, లక్ష్మిరెడ్డి, కల్లుబావి రాజు, శరత్ కుమార్, రంగస్వామి, ఆల్ఫా విజయేంద్ర, థామస్, శ్రీకాంత్, శ్రీరంగ, సుదర్శన్ పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఉన్నతస్థాయికి ఎదగాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - హోళగుంద

బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ బాల నరసింహులు

విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్ఐ ఎస్.నరసింహులు తెలిపారు. మంగళవారం హోళగుందలోని కెజిబివి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులకు ప్రేమ, బాధ, కష్టంగా ఉన్నా పిల్లను దూరంగా హాస్టల్‌లో ఉంచి చదివిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుపై ధ్యాస ఉంచి బాగా చదువుకుని తల్లిదండ్రుల కష్టాన్ని మరిచిపోయి గర్వంగా చెప్పుకునేలా మంచి అలవాట్లు, మార్కులు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు నగదు బహుమతులను అందజేశారు. రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్న వారికి విలువైన బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నామినేటెడ్ పదవుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండో జాబితాల్లో మైనార్టీలకు సముచిత న్యాయం కల్పించిందని టిడిపి ముస్లిం, మైనార్టీ సెల్ కర్నూలు పార్లమెంట అధ్యక్షులు సయ్యద్ అప్సర్ బాష తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు అన్యాయం చేస్తే కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తోందని తెలిపారు. మహ్మద్ షరీఫ్‌కు అడ్వయిజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, మైనార్టీ అఫైర్స్ కేబినెట్ ర్యాంకు, ముస్తాక్ అహ్మద్‌కు ఎపి స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్థానం కల్పించిందన్నారు. టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు కుడా ఛైర్మన్ పదవి కేటాయించడంపై హర్ష వ్యక్తం చేశారు.

21న బహిరంగ వేలం : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - ఆలూరు

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ వీరభద్రప్ప

ఆలూరు పంచాయతీ పరిధిలోని సంతమార్కెట్‌లో ఎన్‌ఆర్ యుఎం నిధులు రూ.1.20 కోట్లతో నిర్మించిన 27 వ్యాపార సముదాయ భవనాలకు ఈనెల 21న బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు డిఎల్‌పిఒ వీరభద్రప్ప తెలిపారు. మంగళవారం ఆలూరు పంచాయితీ కార్యాలయంలో వీరభద్రప్ప, ఇఒ ప్రభాకర్ మాట్లాడారు. 27 షాపుల్లో 1 నుంచి 10, 17 నుంచి 21 వరకు పెద్ద షాపులు.. 11 నుంచి 16, 22 నుంచి 27 వరకు చిన్న షాపులు ఉన్నాయని తెలిపారు. డిపిఒ భాస్కర్ ఆదేశాల మేరకు సర్పంచి అరుణదేవి, తాను, ఇఒ చర్చించుకొని పెద్ద షాపులకు రూ.3 వేలు, చిన్న షాపులకు రూ.2 వేలు సర్కార్ పాటగా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్ ప్రకారం ఎస్సీలకు 15 శాతం (4), ఎస్టీలకు 6 శాతం (2), బీసీలకు 30 శాతం (8), మిగిలినవి ఇతరులకు కేటాయించనున్నట్లు తెలిపారు. షాపుల బహిరంగ వేలం పాటలో పాల్గొనేవారు ఆలూరులో నివాసం ఉండాలన్నారు. పాట దక్కించుకొనే వారు రూ.లక్ష సాల్ వెన్స్, నివాసం, సామాజిక వర్గానికి చెందిన ధ్రువపత్రాలు సమర్పించాలని తెలిపారు. పాట దక్కించుకున్న వారు, వారి కుటుంబలోని వారు మాత్రమే వ్యాపారం చేసుకునేందుకు అర్హులని చెప్పారు. ఇతరులకు బాడుగకు ఇస్తే ఆ షాపును పంచాయతీ స్వాధీనం చేసుకొని ఇతరులకు వేలం వేసి ఇస్తామన్నారు. ఒక షాపునకు ధరావతు చెల్లించి హెచ్చు పాట పాడి దక్కించుకున్న, మరో షాపునకు ధరావత్తు చెల్లించి సర్కార్ పాట పాడవచ్చని తెలిపారు. పెద్ద షాపులకు రూ.30 వేలు, చిన్న షాపులకు రూ.25 వేలు ధరావతు చెల్లించాలని చెప్పారు.

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు విరోబ రావు, ఉపాధ్యాయులు అభినం దించారు. ఈ సందర్భంగా విరోబరావు మాట్లాడారు. రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జిఎఫ్ ఫుట్‌బాల్ జట్టుకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 7న కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినులు బి.రాధమ్మ, కె.ధనశ్రీ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. మళ్లీ కర్నూలు జిల్లా జట్టు తరపున ఈనెల 8, 9, 10న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారని పేర్కొన్నారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజు, నరసింహరాజును అభినందించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రాజశేఖర్, అన్వర్ బాష, ఈరన్న, సుల్తానా, పుష్పలత, ఉమామహేశ్వరి, సంధ్యారాణి పాల్గొన్నారు.

దళిత నాయకుని కుమార్తె వివాహానికి సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


తాళి, పట్టు బట్టలు, ఆర్థిక సాయం అందజేస్తున్న రంగయ్య దంపతులు

పట్టణంలోని దళిత నాయకుడు రంగన్న అలియాస్ ఆంథోని కుమార్తె వివాహానికి సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య దంపతులు తాళి, పట్టుబట్టలు, కొంత నగదు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. దళిత, బహుజనులకు సమతా సైనిక్ దళ్ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆంథోని దళిత పోరాటాల్లో నిత్యం ఉండే మంచి వ్యక్తి అని కొనియాడారు. మాదిగలు తమ ఇంటి ఆడపడుచులుగా భావిస్తామని సమతా సైనిక్ దళ్ మహిళా కన్వీనర్ విజయలక్ష్మి తెలిపారు. సీనియర్ నాయకులు కనకవీడు నాగప్ప, పేటయ్య, రాయలసీమ నాయకులు మల్లేష్, పరమేష్, జిల్లా నాయకులు నల్లన్న, బలరాం, రాముడు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి - హోళగుంద

ఎండియు ఆపరేటర్ హెచ్.వీరభద్రప్ప (41) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు ఎండియు వాహనం ద్వారా గ్రామాల్లోకి వెళ్లి రేషన్ దుకాణం ద్వారా బియ్యం, చక్కెర బ్యాళ్లు ప్రజలకు అందజేసేవారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు తెలిపారు.

పింఛను సొమ్ము స్వాహాపై విచారణ

ప్రజాశక్తి - కౌతాళం

విచారణ చేపడుతున్న అధికారులు

మండలంలోని సులేఖరి గ్రామంలో పింఛను సొమ్ము స్వాహాపై డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి, కౌతాళం ఎంపిడిఒ సుబ్బరాజు విచారణ చేపట్టారు. మంగళవారం సులేఖరి గ్రామ సచివాలయ కార్యాలయంలో పింఛనుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయంలో 2021 ఫిబ్రవరి నుంచి నవంబర్ 2021 వరకు ప్రభుత్వం వారికి కట్టాల్సిన పెండింగ్‌లో ఉన్న పింఛనుపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. 7 నెలలకు సంబంధించిన రూ.5.40 లక్షలకు సంబంధించిన వాటిపై అప్పటి ఇన్‌ఛార్జీ సోషల్ వెల్ఫేర్ అధికారి, ప్రస్తుతం వ్యవసాయ శాఖ సహాయకులు పరమేష్ కుమార్ నాయక్‌ను విచారించారు. దీనిపై పొంతన లేని సమాధానం వచ్చినట్లు సమాచారం. సరైన రికార్డులు కూడా విచారణకు వచ్చిన అధికారులకు చూపించలేకపోయారని అధికారులు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ, హౌసింగ్, గోకులం షెడ్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఎపిఒ మాధవ శంకర్, కార్యాలయపు పరిపాలన అధికారి సత్యన్న, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశులు, అబ్దుల్ కరీం, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

రాజు ఎన్నిక పట్ల హర్షం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని సొగనూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎం.రాజు యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎన్నిక కావడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం యుటిఎఫ్ రూరల్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సుధాకర్, సీనియర్ నాయకులు మల్లారి నాగరాజు, జిల్లా కౌన్సిలర్లు ఎ.భాస్కర్, బి.రామాంజనేయులు, తులసమ్మ, మండల నాయకులు చిన్న ఎల్లప్ప, సంపత్, హనీఫ్, వెంకటేష్‌లు రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. తనపై నమ్మకంతో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

'సూర్య ఘర్'ను వినియోగించుకోవాలి

- ఎఇ నాగేంద్ర

ప్రజాశక్తి - నందవరం

పిఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని విద్యుత్ అధికారి నాగేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం సూర్య ఘర్ యోజన పథకం ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గిస్తుందని తెలిపారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను వినియోగదారుడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు అమ్ముకునే సదుపాయం ఉందన్నారు. సోలార్ ఏర్పాటుకు తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలను కూడా ప్రభుత్వం ఇప్పిస్తోందని తెలిపారు.

మాట్లాడుతున్న బుట్టా రేణుక

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా..?

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులతో పాటు వైసిపి సోషల్ మీడియాపై తప్పుడు కేసులు నమోదు చేస్తోందని, ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక ప్రశ్నించారు. మంగళవారం స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని వైసిపి కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే అధికారం ప్రతి ఒక్కరికీ ఉంటుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తుంది ఏమిటని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. తల్లికి వందనం పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తామని చెప్పారని, కానీ బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించారని తెలిపారు. మద్యం షాపుల నుంచి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వైసిపి నాయకులు బుట్టా శివ నీలకంఠ, గడ్డం నారాయణ రెడ్డి, మూగతి విరుపాక్షి రెడ్డి, పేట శ్రీనివాస రెడ్డి, గొల్ల నాగరాజు పాల్గొన్నారు.

జిన్నింగ్ హమాలీల కూలి రేట్లు పెంచాలి

- జిన్నింగ్ హమాలీ యూనియన్

ప్రజాశక్తి - ఆదోని రూరల్

జిన్నింగ్ హమాలీల కూలి రేట్లు పెంచాలని మర్చంట్ అసోసియేషన్‌కు జిన్నింగ్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం డిమాండ్ నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ ఉపాధ్యక్షులు ఈరన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ సీనియర్ నాయకులు బి.మహానందరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిప్పన్న, పిఎస్.గోపాల్, ఉపాధ్యక్షులు డి.లక్ష్మన్న మాట్లాడారు. హమాలీల కూలి రేట్లు పెంచి వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. డిమాండ్ నోటీసు ఇచ్చిన ఏడు రోజుల్లోపు సమస్యను పరిష్కరించాలని, లేకపోతే జిన్నింగ్ హమాలీలు నిర్వహించే ఆందోళనకు యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.రాజు, బి.తిమ్మప్ప, హమాలీ మేస్త్రీలు ఈరన్న నాయక్, బి.చిట్టి, బి.వెంకటేశులు, బి.హనుమంతు, బి.నాగేష్, పిఎస్.దేవేంద్ర, బి.కృష్ణ, క్రాంతి, బి.నరసింహులు, పరశురాం పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నేటి నుండి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

ప్రజాశక్తి- బనగానపల్లె రూరల్

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి ఉత్సవాలు బుధవారం నుండి బనగానపల్లె పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నేలమఠం, అచ్చమాంబ మఠం, రవ్వలకొండ క్షేత్రం ఆలయ అర్చకులు మంగళవారం తెలిపారు. ప్రతి ఏటా కార్తీక శుద్ధ ద్వాదశి రోజున వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి వేడుకలు ఆయా ఆలయాల్లో ఘనంగా నిర్వహిస్తారు.

వయోజన విద్య అక్షరాస్యత ఉల్లాస్ శిక్షణ

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

స్థానిక పొదుపు భవనం హాల్‌లో వయోజన విద్య అక్షరాస్యత ఉల్లాస్‌కు సంబంధించిన ట్రైనింగ్ ప్రోగ్రాం డిఆర్‌డిఎ వెలుగు అసిస్టెంట్, ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్.అడ్డాకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. ఎంపిడిఒ రమణ మహిళలకు వయోజన విద్య ప్రాముఖ్యత గురించి పూర్తిగా తెలియజేశారు. అడల్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆది నరసింహుడు, ఎంఇఒ స్వరూప, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ సాలమ్మ, రామ సుంకమ్మ పాల్గొన్నారు.

ఐఐటి ఒలింపియాడ్ పరీక్షలో శ్రీ శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ సుధాకర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అభ్యాస్ అకాడమీ అక్టోబర్ నెలలో నిర్వహించిన ఐఐటి ఒలింపియాడ్ పరీక్షలో నంద్యాల క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో విజయం సాధించారు. 8వ తరగతి విద్యార్థి లోకేష్ 3వ ర్యాంక్, 7వ తరగతి విద్యార్థి సంతోష్ 3వ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి పూర్ణచంద్ర 2వ ర్యాంక్ సాధించాడు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను పాఠశాల చైర్మన్ సుధాకర్ అభినందిస్తూ మెమెంటో ప్రదానం చేశారు. చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు సాధించిన ఈ విజయం తమకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఐఐటీ ఇంచార్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో పదోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఆదోని, నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులలో 70:30 నిష్పత్తి ప్రకారం అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.ఇస్మాయిల్, ఐ.మరియానందం లు డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఒ ఎస్. శామ్యూల్ పాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం నుండి వచ్చిన వివరాలలో తేడాలు ఉన్నట్లయితే మరికొంత సమయం తీసుకుని, సమీక్షించి మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలోని పోలీస్ స్టేషన్ దగ్గర రోడ్డు రవాణా శాఖ అధికారి బాబుకిషోర్ మంగళవారం రహదారి భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని లేనిచో రూ.వెయ్యి జరిమానా, వాహనదారుల లైసెన్సును మూడు నెలల పాటు రద్దు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు తెలుసుకున్న నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగరంలో వివిధ కాలనీల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన ఆయా సమస్యల ప్రదేశాలను, అలాగే పలు కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. గీతానగర్, మురాహరినగర్, నిర్మల్‌నగర్, ధనలక్ష్మి నగర్, గురురాఘవేంద్ర, సుంకేసుల రోడ్డు, చెక్‌పోస్ట్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, మురుగు కాలువలు లేవని, తాగునీటి సరఫరా సక్రమంగా రావడం లేదని, ఆయా కాలనీల స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, ఇతర సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర రెడ్డి, డిఇఇ క్రిష్ణలత, ఎఇ భానుప్రకాష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన,పట్టు పరిశ్రమలలో రైతులకు ఉపయోగాలు

ప్రజాశక్తి-డోన్ : ఉద్యాన శాఖ,పట్టు పరిశ్రమ శాఖ లలో రైతులకు అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయనీ వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి యు.నాగరాజు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిని జి.పరమేశ్వరిలు అన్నారు. మంగళవారం డోన్ మండలం లోని గోసానిపల్లి, చింతలపేట రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు డోన్ ఉద్యానశాఖ అధికారిని కళ్యాణి తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి యు.నాగరాజు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిని జి.పరమేశ్వరి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రైతులకు ఉద్యాన శాఖ , పట్టు పరిశ్రమ శాఖల పథకాలు, ఉపయోగాను తెలిపారు. రైతులు ఉద్యాన శాఖ పంటలైనటువంటి మామిడి,చీని,ఉల్లి, కూరగాయలతో పాటు కొత్త పంట, ఆయిల్ ఫామ్ పంటను నీళ్లు పుష్కలంగా ఉన్న రైతులు సాగు చేసుకున్నట్లయితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. డోన్ మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ మాట్లాడుతూ రైతులు రబి పంట కాలంలో పప్పు శనగ,జొన్నలు,వేరుశనగ,ఉల్లి పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట బీమా ప్రీమియం సర్వీస్ సెంటర్‌లో కట్టాలన్నారు. పట్టు పరిశ్రమ మండల అధికారి ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు మమత, సౌజన్య ఆయా గ్రామా రైతులు పాల్గొన్నారు.

న్యూమోనియాపై 'మెడికవర్'లో అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కె.వినోదాచారి , వేదికపై డాక్టర్‌సువర్ణ లక్ష్మీకల్ల

ప్రతి సంవత్సరం కొత్త థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం 'క్యాంపెయినింగ్ ది ఫైట్ టు స్టాఫ్ నిమోనియా' అనే థీమ్ తో ప్రచారం నిర్వహిస్తారన్నారు. న్యుమోనియా అంటువ్యాధి. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గడం, తుమ్మడం వల్ల క్రిములు మనం పీల్చే గాలిలోకి వ్యాప్తిచెందుతాయని డాక్టర్ సువర్ణ లక్ష్మి కల్లి ఎండి కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ , డాక్టర్ కె.వినోద్ ఆచారి, ఎండి ముంబై కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ వివరించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...

ప్రపంచ వ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాలకు కారణమైన ప్రపంచంలోనే అతిపెద్ద అంటువ్యాధి. న్యుమోనియా అనేది బాక్టీరియా, వైరస్‌లు లేదా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా ఏర్పడే ఒక ఇన్ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిజార్డర్, ఇది ఊపిరితిత్తుల గాలి సంచులను 'అల్వియోలీ' అని పిలుస్తారు. ఇది గాలి సంచులలో ద్రవం లేదా చీము చేరడం వల్ల శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఇది ఒక అంటు వ్యాధి, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న వ్యక్తికి, ముఖ్యంగా పిల్లలు , వృద్ధులలో ప్రాణాంతకం కావచ్చు. న్యుమోనియా అనేది నివారించదగిన, చికిత్స చేయగల అంటు వ్యాధి. చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, గత సంవత్సరాల్లో న్యుమోనియా , ఇతర శ్వాసకోశ అంటువ్యాధుల కారణంగా మరణాల సంఖ్య బాగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా న్యుమోనియా కారణంగా పెద్దలు , చిన్నపిల్లలు కొన్ని లక్షల మంది ప్రాణాలను కోల్పోతున్నారు. 2 లేదా అంతకంటే తక్కువ వయసున్న పిల్లలు , 65 అంతకంటే ఎక్కువ వయస్సు పెద్దవారు. ఆస్తమా, దీర్ఘకాలికి సిఒపిడి గుండె వ్యాధులు ఉన్నవారు.సిగరెట్ స్మోకింగ్ అధికంగా చేసేవారు.బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కలిగిఉన్నవారు,కొన్ని రసాయనాలు, కాలుష్య కారకాలకు, విషపూరిత పొగలకు గురైనవారు. ఈ వ్యాధికి గురైన వారు దగ్గు, రక్తంతో కూడిన కఫం , చలి జ్వరం, శ్వాస కోశాల్లో నొప్పి, ఛాతీ భాగంలో నొప్పి, తలనొప్పి, ఆక్సిజన్ స్థాయిల్లో హెచ్చుతగ్గులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో వికారం, వాంతులు లేదా విరేచనాలు కలుగుతాయని వివరించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని చూచించారు. అనుభవజ్ఞులైన వైద్యులచే మెడికవర్ హాస్పిటల్స్ 24/7 చిన్న అందుబాటులో ఉంది చికిత్స అందిస్తూ, సరైన సమయంలో సరైన వైద్యం, అత్యాధునిక సదుపాయాలతో మన మెడికవర్ హాస్పిటల్స్ లో వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ వారిచే అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

24 న కురువల కార్తీక వనభోజనం

కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం అధ్వర్యంలో కర్నూలు జిల్లా కురువ ల కార్తీక వనభోజనం ఈనెల 24న ఆదివారం జిల్లా కేంద్రంలోని పెద్దపాడు రోడ్ లో ఉన్న ఎపి మోడల్ స్కూల్ సమీపంలో గల శ్రీ భీరప్ప స్వామి దేవాలయం ఆవరణములో జరుగుతుందని కురువ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఉదయం ఎంపీ బస్తిపాటి నాగరాజు తన క్యాంప్ కా ర్యా ల యం లో

ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి, పాల సుంకన్న, శ్రీలీలమ్మ, పెద్దపాడు ధనుంజయ, వెంకటరాముడు పాల్గొన్నారు. ఎంపీ బస్తిపాడు నాగరాజు మాట్లాడుతూ పార్టీలకతీతంగా జిల్లాలోని కురువ కులస్థులు అందరూ ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తవుడు శ్రీనివాసులు, కేసి నాగన్న, బి. సి.తిరుపాల్, పెద్దపాడు పుల్లన్న, బస్తిపాడు రమణ, ఎ ం చి క ల పా డు వెంకటరాముడు, పందిపాడు భీష్ముడు పాల్గొన్నారు.

బడ్జెట్టా... మేనిఫెస్టోనా!

- కేటాయింపులేవి? -
- పిసిసి చీఫ్ షర్మిల ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది బడ్జెట్టా లేక మేనిపెస్టోనా అనేది అర్థం కావడం లేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల అన్నారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బడ్జెట్టే అయితే పథకాల అమలుకు నిధుల కేటాయింపులేవని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అమలు చేయాలంటే ప్రతి ఏటా రూ.1.20 లక్షల కోట్లు కావాలని, బడ్జెట్‌లో వీటికి పావు వంతు కూడా నిధులు కేటాయించలేదన్నారు. మహిళా శక్తి కింద ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదని చెప్పారు. తల్లికి వందనంకు రూ.10వేల కోట్లు కావాల్సి ఉండగా రూ.2 వేల కోట్లే కేటాయించారని చెప్పారు. ఉచిత బస్సు పథకానికి ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు లేవు గాని ప్రజల నుంచి వసూలు చేసేది ఘనంగా ఉందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు వసూలు చేస్తున్నారని, మరోవైపు రిజిస్ట్రేషన్ చార్జీలు త్వరలో భారీగా పెంచేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. పాలకపక్షం వైఖరిలా ఉంటే వైసిపి అధినేత జగన్ వైఖరి మరోలా ఉందన్నారు. అసెంబ్లీకి వెళ్లను అనడం జగన్ అహంకారానికి నిదర్శనమని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుంటే ప్రజలకు వెన్నుపోటు పొడిచినట్లేనన్నారు.. ఈ అంశంపై వైసిపి ఎమ్మెల్యేలకు లేఖ రాసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తనను, సునీతను, విజయమ్మను ఎలా బడితే అలా మాట్లాడారని, అసభ్యకరంగా పోస్టులు పెట్టాలని చెప్పింది జగనే అని తెలిపారు. మహిళలు రాజకీయాల్లో ఉండాలంటే భయపడే పరిస్థితికి తీసుకువచ్చాని చెప్పారు. ఈ సమావేశంలో పిసిసి నాయకులు నరహరిశెట్టి నర్సింహారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషు, జెసి బి.నవ్య, తదితరులు

14 నుండి 20 వరకు సహకార వారోత్సవాలు

వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 14 నుండి 20 తేది వరకు సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలు వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, డిసిఒ రామాంజనేయులు, సిఇఒ విజయ్ కుమార్, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి జఫ్రిన్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.